# వడ్డెర చండీయాగం

-ఏ. సూర్యప్రకాశ్

తెలుగు సాహిత్యంలో విలక్షణ, విభిన్న నవలాకారుడు కీ॥శే॥ వడ్డెర చండీదాస్. 1937లో జన్మించిన చండీదాస్ ఐదేళ్ళొచ్చేదాకా కృష్ణా జిల్లాలో పెరిగారు. ఆ తరువాత నిజామాబాద్‌కు దగ్గర్లో కొండ ప్రాంతంలో బాల్యం గడిపారు. యవ్వనం హైదరాబాద్‌లో గడచింది. ఫ్రెంచ్ రచయిత ఓ (-పాల్-సార్త్) మీద పరిశోధన చేసి పుస్తకం వ్రాసి డాక్టరేట్ పుచ్చుకున్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేశారు. ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో 'హిమజ్వాల' సీరియల్‌గా ప్రచురించబడుతున్నప్పుడు, తెలుగు సాహిత్యాకాశంలో ఒక ఉరుము ఉరిమి ఒక మెరుపు మెరిసింది. 1985లో 'చీకట్లోంచి చీకట్లోకి' అనే కథల సంపుటి ప్రచురించారు. అదే ఆంధ్రజ్యోతిలో 'అనుక్షణికం' ధారావాహికగా ప్రచురించబడుతున్నప్పుడు 1984లో పాఠకులు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. అందులో కొన్ని అలకనంద ప్రచురణకర్తలు నవల చివరిలో ప్రచురించారు. వారు ప్రచురించని వాటిలోంచి ఏరి కొన్ని ఆధునిక పాఠకులకు వారి ఆలోచనా సరళి తెలియటానికి నేను సేకరించాను. వారి మాటల్లోనే చదవండి:-

### ఆకలీ-లైంగికమూ

మనిషిలో అత్యంత ప్రాథమికమూ, సామాన్యమూ, ప్రాముఖ్యమూ అయిన రెండు అంశాలు- ఆకలీ, లైంగికమూ. మనిషికి ఆకలి అంటూ లేకపోతే మానవ చరిత్ర యిలా వుండేది కాదు. మనిషికి లైంగికం లేకపోయినా మానవ చరిత్ర యిలా వుండేది కాదు (అసలు చరిత్రే వుండకపోనేమో) ఆకలి సమస్యలు, లైంగిక సమస్యలు- మనిషి ఆదిమ స్థితి నుంచి యెదిగిన కొద్దీ అధికమవుతూ వొచ్చాయి. ఆ తరవాత యింకా యెన్నెన్నో అంశాల సమస్యలు!

అయితే కొన్ని కొన్ని సమస్యలు కొన్ని రకాల వ్యవస్థలలో స్థితులలో కొందరికే వుంటాయి. కానీ లైంగిక సమస్య అన్నిరకాల వ్యవస్థల్లోనూ స్థితుల్లోనూ దాదాపు మనుషులందరికీ వుంటుంది. అంతేకాదు, అన్నిటికంటె ప్రత్యేకమైంది కూడా. ఉదాహరణకి- తిండి సమస్య తీరటానికి అవసరమైన ఆర్థిక వ్యవస్థ (మోడ్ ఆఫ్ ప్రొడక్షన్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ వెల్త్) ఏర్పడితే ఆ సమస్య తీరిపోవొచ్చు. లైంగిక సమస్య తీరనప్పటికంటే, తీరే ఏర్పాటు జరిగాక మరింత సంక్లిష్టమవుతుంది.

నా రచనలో మిగతా సమస్యల కంటే లైంగిక సమస్యను (జీవితాన్ని ప్రభావితం చేసే, మలిచే, మలుపులు తిప్పే లైంగిక సమస్యలు. ఆయా వ్యక్తుల మొత్తం ఆంతర్యాన్ని ప్రతిబింబించే లైంగికాంశాలు) ప్రత్యేకించి స్పృశించాను. అయితే యీ సమస్యను ఐసొలేటెడ్‌గా కాక, మానవ స్వభావమంతటిలోంచి, మానవ స్వభావపు తాత్విక సమస్యలోంచి పరిశీలించాననుకుంటాను.

అనంత వైవిధ్య మానవ స్వభావాన్ని కేవలం బ్రహ్మాండంలో అణుమాత్రమంత నేను స్పృశించాను. (ఎన్నో శతాబ్దాలు యెందరు యెన్ని అంశాలను స్పృశించినా యింకా యెంతో మిగిలే వుంటుంది - అనంత వైవిధ్యమే కాక అనంతంగా పరిణమిస్తూ వుండేందున)

### భార్యాభర్తలు, ప్రేమ ప్లస్ సెక్స్

భార్యాభర్తలు కొన్ని కోర్కెలు విడివిడిగా తీర్చుకునే వీలుంటుంది కానీ లైంగిక విషయం- వొంటరిగా వొక్కరే కానందున యిద్దరూ కలిసి చేసే పని. అందు గురించిన కోర్కె, అవసరానికి సంబంధించి చాలా యెక్కువ వ్యత్యాసం వున్నప్పుడు సమస్య వుత్పన్నమవుతుంది. తీరని లేదా తీరాల్సినంతగా తీరని ఆ అవసరం మరొకరితో తీర్చుకోవాలా వొద్దా అనేది స్వభావాన్ని బట్టీ ఆ అవసరపు తీవ్రతని బట్టీ వుంటుంది. ఇది శారీరక స్థాయి అవసరం.

---

**మూడు పూవులు-ఆరు కాయలు**

కొర్దు కవితను / కాదనకుండా
కవితా మాతకు / కలికితురాయిలా
అలంకరించిన / కళాహృదయులకు
'శతకోటి' వందనాలు.
సాహితీ సేద్యంలో / చిన్నా, సన్నకారు రైతుకూ
అందిన ఆపన్న హస్తమే
పండించేను 'చేను' చిరకాలమూ
'మూడు పూవు-లారు కాయలుగా'.

-శ్రీమాన్ శ్రీకాశ్యప

---

### కాలు జారటం!

ఎన్నేళ్ళొచ్చినా తండ్రి చాటునో, తల్లి చాటునో, భర్త చాటునో, భార్య చాటునో, అత్త చాటునో, మామ చాటునో తానుగా నిలబడే మానసిక దిటవుతనం లేకండా యెవరో వొకరిచాటున బతికేవాళ్ళుంటారు. వాళ్ళలో యెక్కువమంది దేనికైనా సమాధానపడి రాజీపడిపోతారు. 'కాలు జారటం' అనే భావనే నాకు కంపరం పుట్టిస్తుంది. దీనిని కేవలం స్త్రీ శీలానికి సంబంధించి వాడుతుంటారు. ఆడదాని కాలేగానీ మగాడి కాలు జారదు కదా పితృస్వామికంలో! కాలు జారటమూ లేదు, వేలు జారటమూ లేదు. పరస్పరం కోరుకుని దిగాక, కలిసి జీవించాలి (కనీసం అందుకు యత్నించాలి తమ శక్తి మేరకి)

### కల్పనా సాహిత్యం

కల్పనా సాహిత్యం పాఠకులను నేరుగా ఉద్రేకించేదిగా వుండకూడదు. ఉద్దీప్తి కలిగించేదిగా వుండాలి. అది మేధా సంబంధిగా వుండక హృదయ సంస్పంద సంబంధిగా వుండాలి. నేరుగా ఆలోచనని రేకెత్తించేదిగా కాక, అస్తిత్వం అంతటినీ అనుభూతితో వుద్దీప్తం చేసి, అందులోంచి ఆలోచనను రేకెత్తించేదిగా వుండాలి. వ్యాసం నేరుగా ఆలోచనను రేకెత్తించటం సమంజసం. ఉద్రేకం (ఇమోషనల్ ఫీలింగ్) క్షరింపులోకి దిగజారుతుంది. ఉద్దీప్తి (ఇంటెన్స్ ఫీలింగ్) పరిపుష్టిలోకి యెదుగుతుంది.

పెట్టుబడిదారీ వ్యాపార సంస్కృతిలో కొన్ని హర్షించతగిన అంశాలతో పాటు స్త్రీ విమోచనపరంగా కొన్ని ఫోనీ, డిస్ కార్డెంట్, సెల్ఫ్ డిగ్రేడింగ్ షాలో సిమ్మరింగ్స్ వుండొచ్చు. అక్కడ ఆ ప్రకృతి దృశ్యాలకిచ్చిన వంగులు ఆ భావాన్నే సూచిస్తాయి.

అర్ధనగ్నత్వమో, నగ్నత్వమో అక్కరలేదు. పన్నెండేళ్ళ చిన్న పిల్ల నుంచి నాలుగు పన్నెండ్ల స్త్రీ వరకు యెలాంటి వ్యక్తినైనా – పవిట కొంగు కనిపిస్తే చాలు నానా రభసా చేసే వాళ్ళుంటారు కొందరు. (ఇందుకు ముఖ్య కారణం– శీలం పురుషుడికి అనవసరంగానూ స్త్రీకి అవసరంగానూ భావించే మన సామాజిక ఆర్థిక విధానం, కఠిన శిక్షలు లేకపోవటం కూడా) సంప్రదాయిక కన్వెన్షనల్ బ్రిటన్‌లో మెడ నుంచి పాదాల వరకు ముసుగుల్లాంటి దుస్తులేసుకున్న విక్టోరియన్ కాలంలోనే వ్యభిచారం యెక్కువగా వుండిందట. నగ్నత్వం సాపేక్షికం. పందుల్లా పొర్లాడే కామస్థాయి మనుషులకి బట్టలున్నా లేకపోయినా ఆ కళ్ళకి కనిపించేదొకటే.

## నిండైన నీనయనాలు - రెండు నీలి సముద్రాలు

పూవు పరిమళంతో / పూవు అవుతుందిగాని
ముళ్ళపొదలతో కాదు! / కళ్ళు చూసే దృష్టితో
కళ్ళవుతాయి గాని / రెప్పల పరిధితో కాదు!
నా చూపుకు ఓ గులాబి తగిలించు
సౌందర్యం నా కలం పంచుతుంది
నా తుపానుకు నీ ప్రశ్న సంధించు
నాలోని మౌనం నీకు జవాబై వివరించుతుంది
మనసులోని మాట ఒక్కటే / కాని రెండు
అక్షరాలుగా పెదాల నుంచి రాలుతుంది
గుండెలోని బాధ ఒక్కటే
కాని రెండు కన్నుల్లోంచి కన్నీరు కారుతుంది.
మొగ్గలాంటి నిశ్శబ్దాన్ని
తీయగా చీలుస్తోంది కోయిల
మొదలవుతుంది ఎటుచూసిన
వెలుగుతూ ప్రేమజ్వాల / స్నేహితుల మాటలు
తీరాల్లేని సముద్రాలు / ప్రేమికుల చూపులు
పెదాల మధ్య తుపానులు
పరిమళం లేని పూవు / పువ్వేకాదు
అలలు లేని సముద్రం
సముద్రమే కాదు / ప్రేమ లేని జీవితం
జీవితమే కాదు
వెన్నెల్ని తిన్న ఇసుక తిన్నెలు
నీ అవయవాలు
రెండు నీలి నీలి సముద్రాలు
నిండైన నీ నయనాలు
నీ ప్రతి ఉచ్ఛ్వాస నిశ్వాసలోని పరిమళం
ప్రపంచంలోని ఏ సుమంలోనూ లేదు
ఏ పూలతోటలోనూ
నీ మేనులోనున్న సుగంధం దొరకదు
నీ కళ్ళలో దాచుకున్న
చూపుల చుక్కలకు లెక్కే లేదు
నీ కనురెప్పల మధ్య చిక్కనిది
అది హృదయమే కాదు
నాకు ఈ లోకంలో ఏ అనుభవమూ కొత్త కాదు
ప్రపంచంలోని ఏ మధువులోనూ
నీ చూపుల్లో వున్నంత మత్తు లేనే లేదు

**-వై. శ్రీరాములు**